క్లుప్తంగా

నేడు వైకేఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

గుంటూరు రూరల్: ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ ఫౌండర్ ఎన్నారై ఏరువ సాయిరాం 1998లో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి అప్పటి నుంచి ప్రతి ఏటా గుంటూరులోని 52 ప్రభుత్వ పాఠశాలలకు రూ.36 వేల చొప్పున రూ.45 లక్షల వరకూ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఇదే విధంగా ఇప్పటివరకూ సుమారు ట్రస్ట్ ద్వారా రూ.10 కోట్ల వరకూ స్కాలర్‌షిప్‌లను అందించటం జరిగిందన్నారు. ప్రతి ఏటా పెద పలకలూరు గ్రామంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో జరిగే కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే సమాచారం అందిన విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులపై కేసు కొట్టివేత

తెనాలి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన కేసులో దర్యాప్తు సరిగా లేని కారణంగా తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ కేసును కొట్టివేశారు. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గోవాడ వీఆర్‌వోపై అమృతలూరు పోలీస్ స్టేషన్‌లో 2016లో సీఎఫ్‌ఆర్ కేసు నమోదైంది. రేషన్ డీలర్‌షిప్‌కు సంబంధించిన కేసును కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నమోదు చేశారు. కేసు మంగళవారం విచారణకు వచ్చిన పరిశీలించిన న్యాయమూర్తి దర్యాప్తు సరిగా లేదని గుర్తించారు. దీంతో కేసును కొట్టివేస్తూ ఇదే విషయమై బాపట్ల జిల్లా ఎస్పీకి లేఖ రాయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు న్యాయశాఖ సిబ్బంది తెలిపారు.

తక్కువ ధరకు నాణ్యమైన సరకులు

తెనాలి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వినియోగదారుల సౌలభ్యం కోసం నాణ్యమైన స్టీమ్ బియ్యం, బియ్యం, కందిపప్పును డివిజనులోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణంలోని గాంధీపార్కు, గంగానమ్మపేట, మంగళగిరిలో వ్యవసాయ మార్కెట్‌యార్డు పక్కన, పొన్నూరు రైతుబజార్లలో ఈ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అట్రాసిటీ యాక్ట్‌పై ప్రచారం చేయాలి

తాడేపల్లిరూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌పై మంగళగిరి మండలంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంగళవారం ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర అధ్యక్షుడు కారుమంచి రామారావు మంగళగిరి తహసీల్దారు నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రతి నెలా 30న జరగాల్సిన పౌరహక్కుల దినోత్సవం మంగళగిరిలో జరగడం లేదని తెలిపారు. దళిత చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, దళితులపై దాడులను నివారించాలని తహసీల్దారును కోరామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ సెక్రటరీ పాల్గొన్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

తెనాలి రూరల్: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో దళిత బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కఠెవరపు దేవానంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మైనర్‌పై ఇలాంటి దారుణానికి పాల్పడిన అతడిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదలకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు.

విద్యుత్ చౌర్యం.. రూ.21 లక్షల అపరాధ రుసుం

విద్యుత్ శాఖ అధికారుల విస్తృ తనిఖీలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖలో డీ–6 సెక్షన్ పరిధిలోని ఏటీ అగ్రహారం, కన్నవారితోటలో మంగళవారం విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.సూర్యప్రకాష్, శ్రీనివాసులుబాబు పర్యవేక్షణలో 58 మంది అధికారులు, 120 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి 4,608 సర్వీసులను తనిఖీలు చేశారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న 205 మందికి రూ.10.81 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరికి కాక ఇతర కేటగిరిలో విద్యుత్తు వాడుతున్న 5 మందికి రూ.70 వేలు అపరాధ రుసుం విధించారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుకున్న 200 మందికి రూ.10.11 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, బి.రాజమోహన్, ఏఈలు కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎస్.వెంకటేశ్వర్లు ఇతర అధికార సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం.. పట్టించుకోని యంత్రాంగం


29వ వార్డులో మురుగు కాలువలో పేరుకున్న చెత్త, వ్యర్థాలు


29వ వార్డులో రోడ్డుపై మురుగు చేరి అధ్వాన్నంగా ఉన్న వీధి

- వీధుల్లో అపరిశుభ్రత
- ఇళ్లల్లో దోమల దండయాత్ర
- రోడ్లపైనే పారుతున్న మురుగు

పొన్నూరు: పట్టణంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పలు వార్డుల్లో మురుగు వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి పట్టణవాసులకు కునుకులేకుండా చేస్తున్నాయి. పారిశుద్ధ్య సమస్య అధికంగా ఉన్నా మున్సిపాలిటీ యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవడం వంటి ప్రాథమిక చర్యలకు కూడా ఉపక్రమించకపోవడం గమనార్హం

కాలనీల్లో దయనీయం

పట్టణంలో 31 మున్సిపల్ వార్డులు ఉన్నాయి. సుమారు 70 వేల జనాభా ఉన్నారు. ప్రధానంగా 29వ వార్డులో పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా ఉంది. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో రోడ్డుపై పేరుకుపోతుంది. అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాలువలతో మురుగు రోడ్డు మీదే నిలిచిపోతోంది. కాలువల్లో చెత్త, వ్యర్థాలను తొలగించకపోవడంతో మురుగు స్తంభించి దుర్వాసన వెదజల్లుతోంది. పలు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాల సేకరణ పూర్తయిన వెంటనే ఆ ప్రదేశంలో బ్లీచింగ్ చల్లకపోవడంతో దుర్గంధం వెదజల్లడమే కాక, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లటం లేదు. దోమల బెడదతో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అవస్థ పడుతున్నారు.

ఫాగింగ్ ఊసేలేదు...

పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా... దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు అవస్థ పడుతున్నా ఒక్క రోజు కూడా ఫాగింగ్ చేయని దుస్థితి. పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే నామమాత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులుపు కుంటున్నారనే విమర్శలున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో దోమలు పెరుగుతున్న సమయంలో ప్రతి రోజు ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు స్పందించి 29వ వార్డులో మురుగు వ్యవస్థను మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్రపుడెక్క, తూటికాడతో అవస్థలు


పెదకాకాని గోళ్ళమూడి గ్రామాల మధ్య గుంటూరు చానల్‌ను కమ్మేసిన గుర్రపుడెక్క


తక్కెళ్ళపాడు సమీపంలో గుంటూరు చానల్‌ను కమ్ముకున్న గుర్రపుడెక్క, తూటికాడ

పెదకాకాని: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వరుణుడు మొఖం చాటేయడంతో అన్నదాతలు సందిగ్ధంలో ఉన్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి చెప్పదగిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగు జాగు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ ఆధారిత మండలమైన పెదకాకానిలో సుమారు 7,200 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. జూలై మాసం సగం గడిచినా ఆశించిన స్థాయిలో వర్షం పడలేదు. మండలంలో ఉన్న 12 గ్రామాల్లో 8 గ్రామాల్లో ప్రధాన పంట వరి. దాదాపు 15 వేల ఎకరాల్లో సాగవుతుంది. వరి పంటకు ప్రధాన ఆధారమైన గుంటూరు చానల్ (కొత్తకాలువ), హైలెవల్ చానల్ (పాతకాలువ)లు అభివృద్ధికి నోచుకోలేదు. గత వారం రోజుల కిందట గుంటూరు చానల్(కొత్తకాలువ)కు నీరు విడుదల చేసినప్పటికీ కాలువ నిండా తూటికాడ, గుర్రపు డెక్క అల్లుకుని నీటి పారుదలకు ఆటంకంగా మారింది. తాడేపల్లి మండలం సీతానగరం వద్ద ప్రారంభమైన గుంటూరు చానల్ ప్రత్తిపాడు మండలం గారపాడు వరకూ 47 కిలో మీటర్లు వ్యాపించి ఉంది. రైతుల కోరిక మేరకు అధికారులు ఈ కాలువలను వట్టిచెరుకూరు మండలం యామర్తి గ్రామ శివారు వరకూ తవ్వేందుకు భూమి సేకరించారు. ఈ గుంటూరు చానల్‌ను పెదనందిపాడు మండలం దాటి ప్రకాశం జిల్లా పర్చూరు మండలం వరకూ కొనసాగించాలని గత కొంతకాలంగా రైతులు ఆందోళన చేయడం కూడా జరిగింది. ప్రస్తుతం ఈ చానల్ గుర్రపుడెక్క, తూటికాడతో కమ్ముకు పోయింది. ఈ కాలువ ద్వారా సరఫరా అవుతున్న నీటిపై సుమారు 33 గ్రామాల ప్రజలు ఆధారపడి ఉన్నారు. గుంటూరు చానల్ కింద 27 వేల ఎకరాలు ఆయకట్టు సాగవుతుంది. కాలువలో నీటి పరిమాణం తక్కువగా ఉన్నప్పుడు చివరి ఆయకట్టుకు నీరు చేరక పొలం ఎండిపోవడం, నీటి పరిమాణం ఎక్కువగా ఉన్న సమయంలోనూ అధిక వర్షాలకు కాలువలో గుర్రపుడెక్క, తూటికాడ కారణంగా నీరు ముందుకు కదలకు పొలాలకు వరద ముంపుకు గురవుతున్నాయి. అలానే పాతకాలువ (హైలెవల్) పరిస్థితి అధ్వాన్నంగానే ఉంది. కాలువలకు నీరు వదిలే సమయం ఆసన్నమైనా అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంటూరు చానల్, హైలెవల్ చానల్‌ను కమ్మేసిన గుర్రపుడెక్క, తూటికాడ తొలగించాలని, నీరు పారుదలకు ఆటంకం లేకుండా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

టెండర్లు నిర్వహించాం.. పనులు చేపడతాం

పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామం నుంచి గారపాడు వరకూ తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపుతో పాటు కాలువ కట్టలను పటిష్టం చేసేందుకు టెండర్లు నిర్వహించడం జరిగింది. సుమారు 50 లక్షల రూపాయలతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు వచ్చారు. వర్షాలు ఆగిన తరువాత పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సాగునీటి పారుదల శాఖ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం


దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

తెనాలి అర్బన్: దోమలు కుడితే పెద్ద రోగాలు వస్తాయని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వీటిని అరికట్టవచ్చని మలేరియా విభాగ తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని చినరావూరుతోటలో మంగళవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకున్నారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చూడాలన్నారు. వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ షేక్ రషీద్, శానిటరీ సెక్రటరీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు ఫాగింగ్



తాడికొండ: వసతి గృహాలు, నివాసిత ప్రాంతాల్లో దోమల నివారణకు పంచాయతీ అధికారులు మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో భాగంగా బీసీ బాలికల వసతి గృహం, జెండా చెట్టు బజారులో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి, ఫాగింగ్‌కు ఆదేశించినట్లు పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. సుమారు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి వ్యక్తి మృత దేహం నరసరావుపేట రోడ్డులోని సేకరణ హార్ట్ హైస్కూల్ సమీపంలో పడి ఉంది. నల్ల గళ్ల చొక్కా, ఎర్ర ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసినవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని మేడికొండూరు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ సీఐ డి.జైకుమార్ 86888 31380 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

సరైన పోషణ.. పశుసంపదకు రక్షణ

- మూగజీవాల మేత విషయంలో జాగ్రత్తలు అవసరం
- అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు



కొల్లిపర: వ్యవసాయంతోపాటు పశుపోషణ గ్రామాలలో ప్రధాన వృత్తిగా పూర్వ కాలం నుంచి ఉంది. పాడి రైతులు తమ పశువులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం సీజన్ మారి నెమ్మదిగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పశువులు జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి పోషకాహారం పూర్తి స్థాయిలో అందజేయాలి. అప్పుడు మాత్రమే పశుసంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, విటమిన్లు , నీరు అవసరమని పశువైద్యులు సూచిస్తున్నారు.

రోగనిరోధక శక్తి కోసం ఇలా...

పశువుల పెరుగుదలకు, రోగనిరోధక శక్తి మెరుగుకు మాంసకృత్తులు ఎంతో అవసరం. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి ఇవి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా మారడం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటివి పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

దెబ్బల నుంచి రక్షణ ...

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైంది. పిండి పదార్థాల కన్నా కొవ్వు రెండున్నర రెట్లు అధిక శక్తి ఇస్తుంది. గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు అత్యంత అవసరం...

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. నీరు శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలను శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషణ పదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి , మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుండా పశువులు డీహైడ్రేషన్‌కు గురవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల నీరు అవసరం.

రాజరాజేశ్వరిదేవికి ఆషాఢ సారె ప్రత్యేక పూజలు


పుష్పాద్రి లక్ష్మీనరశింహస్వామి

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలోగల స్వయంభూ పుష్పాద్రి రాజ్యలక్ష్మి గోదాదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం, రాజరాజేశ్వరి సమేత ఆకాశ మల్లేశ్వర స్వామి క్షేత్రంలో ఆషాఢ మాసం సందర్భంగా ఈ నెల 19వ తేదీన శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ప్రత్యేక పూజల్లో భాగంగా అమ్మవార్లకు సారె సమర్పణ, రాజరాజేశ్వరి అమ్మవారికి శాకంబరీదేవి అలంకరణ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. కావున భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు శివప్రసాద్

గుంటూరు రూరల్: ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అధ్యాపకుడు పొందూరి శివప్రసాద్‌కు బెల్గావికి చెందిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. మిల్లి డిగ్రి ఎస్టిమేటర్ ఫర్ స్పేస్ సిగ్నల్స్ ఆన్ ఎఫ్‌పీజీఏ అనే అంశంపై ఎమ్మెస్ రామయ్య ఇంజనీరింగ్ కాలేజ్ బెంగళూరు కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆచార్య ఆనంది, డాక్టర్ పి.సత్యనారాయణమూర్తిల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి.రంగబాబు అభినందించారు.

జర్మన్ 'మేక్‌థాన్ 2024' లో వివా విద్యార్థులు


జర్మన్ మేక్‌థాన్ 2024లో పాల్గొన్న వివా స్కూల్ విద్యార్థులు

పెదకాకాని: జర్మనీలోని న్యూరెమ్బర్గ్‌కు చెందిన ప్రతిష్టాత్మక ఓహెచ్‌ఎం విశ్వవిద్యాలయం నిర్వహించిన ఇంటర్నేషనల్ స్టూడెంట్ మేక్‌థాన్ 2024 కార్యక్రమానికి 13 మంది వివా విద్యార్థులు హాజరయినట్లు వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వివా స్కూల్‌లో మంగళవారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ భారత్, జర్మనీల మధ్య పరిశోధనా కార్యకలాపాలను రూపొందించేందుకు విద్యార్థులలోని సృజనాత్మకత, సమస్య పరిష్కారాల నైపుణ్యాల పెంపు, సాంస్కృతిక మార్పిడి కొరకు జూలై 8న జర్మనీలో ఇంటర్నేషనల్ స్టూడెంట్ మేక్‌థాన్ 2024 ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వివా ది స్కూల్‌కు చెందిన 13 మంది విద్యార్థులు, జర్మనీకి చెందిన మార్టిన్ బెహమ్, ఆల్ బెర్ట్ డ్యూరర్ స్కూల్‌కు చెందిన 13 మంది విద్యార్థులతో మూడు బృందాలుగా ఏర్పడి మేక్‌థాన్‌లో సైన్స్ ఆవిష్కరణలు చేపట్టారని వివరించారు. జర్మనీలోని డచస్' మ్యూజియం వేదికగా బవారియా, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ మట్టర్ ఓల్ఫ్ గ్యాంగ్ సమక్షంలో ఇంటర్నేషనల్ స్టూడెంట్ మేక్‌థాన్ 2024లో ప్రొఫెసర్ బెర్నార్డ్ కాస్లర్ ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారన్నారు. విద్యార్థులు విదేశీ విద్యార్థులతో కలసి ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విభిన్న ఆలోచనలు, సంప్రదాయాలు, జ్ఞానాన్ని పంచుకోవచ్చన్నారు. మేక్‌థాన్‌లో సైన్స్ నమూనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు, సైన్స్ టీచర్ వై.ప్రసాదరావు, ఐబీ హెడ్ ఏకే మాధవిలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, డైరెక్టర్ ఎల్టి కమాండర్ కె.శ్రీనివాసరావులు అభినందించారు.

నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరీ యూపీహెచ్‌సీ సందర్శన


రికార్డుల వివరాలను తెలుసుకుంటున్న నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరీ ఆరాధన

తాడేపల్లిరూరల్: ప్రకాష్‌నగర్, అంబేడ్కర్ నగర్ (డ్రైవర్స్ కాలనీ)లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యాలయం నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరీ ఆరాధన పట్నాయక్ సందర్శించారు. 12 విభాగాల్లో అందిస్తున్న సేవలు, రికార్డుల కంప్యూటరైజ్ తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయుడంలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్లు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. గతంలో ఇక్కడ ఉన్న హెల్త్ సెంటర్ జాతీయ నాణ్యత ప్రమాణాలు హామీకి తగినట్లుగా కేంద్ర నిర్వహణ విధానానికిగాను అత్యధిక మార్కులు సాధించిందన్నారు. ఇటీవల రాష్ట్ర వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఢిల్లీలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిత్వ కార్యాలయంలో ఆ ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. ఈ అర్హతా పత్రాలు పొందిన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటి వరకు అవే ప్రమాణాలు కొనసాగిస్తున్నాయా.. లేదా అని తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ జె.విజయలక్ష్మి, హెచ్‌డబ్ల్యూసీ శ్యామల, స్టేట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ దేవి, యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానస, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రత్నం మన్మోహన్, డీపీఎం సైమన్, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్, మలేరియా ఆఫీసర్ శ్రీమన్నారాయణ, హెచ్‌వీ రమాదేవి, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: పట్టణంలో మురుగు కాల్వల పూడికతీత, ఆక్రమణల తొలగింపు పనులు స్పెషల్ డ్రైవ్ కింద నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బోసు రోడ్డులో మంగళవారం ఆక్రమణల తొలగింపును ఆయన పరిశీలించారు. వ్యాపారులు కొందరు అడ్డుకోవడంతో వారితో మాట్లాడి పనిని కొనసాగించారు. మురుగు కాల్వల మీద ఉన్న బండ్లను, ఫ్లోరింగ్‌ను జేసీబీతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మురుగు కాల్వల్లోని పూడికతీత పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అనంతరం 27వ వార్డులో పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, పలువురు టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తాడేపల్లి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులోని అపర్ణ క్లబ్ హౌస్‌లో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌స్టలేషన్ ఆఫీసర్, రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడిగా రావూరి రమేష్‌బాబు, కార్యదర్శిగా సుకుమార్‌రెడ్డి, కోశాధికారిగా రవీంద్రరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్స్ ఎం.వంశీకృష్ణ, పీడీజీ అన్నే రత్నప్రభాకర్, పబ్లిక్ ఇమేజ్ కోచ్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి మాజీ అధ్యక్షుడు కిరణ్ పరుచూరి, మాజీ కార్యదర్శి చంద్ర ఓబులా రెడ్డి, మాజీ కోశాధికారి గోపు నాగ రాజేష్, కాట్రగడ్డ శివన్నారాయణ పాల్గొన్నారు.

వంతెనల నాణ్యతపై దర్యాప్తు జరిపించాలి

లక్ష్మీపురం: ఒక వంతెన కూలితేనే ఎంతో ఆశ్చర్యం కలుగుతుందని అటువంటిది బిహార్‌లో ఇప్పటికి పద మూడు వంతెనలు కూలిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని, దీనిపై అవగాహన సంస్థ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లో పది వంతెనలు ఒకదాని తరువాత ఒకటి కూలిపోయాయని, ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే వారధులు కూలుతున్నాయన్నది స్పష్టంగా తెలుస్తోందన్నారు.

పేదలకు బియ్యం అందజేత

తెనాలి అర్బన్: యడ్లలింగయ్య కాలనీ, పూలే కాలనీలోని పేద యానాదులకు మంగళవారం బియ్యం, పూరిళ్లపై వేసుకునే పరదాలను పంపిణీ చేశారు. ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ రావూరి అంజలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వలంటీర్లు ఇంటూరి బెనహర్, బందెల రమేష్, పుల్లయ్య పాల్గొన్నారు.